

ఎల్లారెడ్డిలోని తెలంగాణతల్లి ప్రాంగణం వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ నాయకులు

మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్

## భరోసా మోసంపై
# రైతన్న కన్నెర్ర

- ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున నిరసనలు
- పలు మండలాల్లో తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నాలు
- పాల్గొన్న రైతులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్

**రైతు భరోసాపై** మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్‌పై రైతాంగం కన్నెర్ర చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి రైతులకు ధోకా చేసింది. ఒక్కో పంట సీజన్‌లో ఎకరానికి రూ.7,500 ఇస్తానని ఎన్నికల ప్రచార సభలో ఊదరగొట్టిన కాంగ్రెస్ పార్టీ, తీరా గెలిచాక ఇప్పుడు ఎకరానికి రూ.12వేలు ఇస్తామని ప్రకటించడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి జిల్లాలో రైతులు, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఎల్లారెడ్డి, బాల్కొండ, కమ్మర్‌పల్లి, వేల్పూర్, ముప్కాల్, నవీపేటలో ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లపై పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రైతుభరోసాపై ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని రేవంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

–నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 6


ముప్కాల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


వేల్పూర్‌లో తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నవీపేట తహసీల్ కార్యాలయం ఎదుట..

## స్థానిక ఎన్నికల్లో బుద్ధిచెబుతాం

### ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 6: ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెబుతామని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణం వద్ద ప్రధాన రహదారిపై చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో రైతుబంధును కొనసాగిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. పోయిన వానకాలం పంటకు రైతుబంధు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. యాసంగి పంట పూర్తయినా ఇప్పుడు కూడా ఇంకా రైతుబంధు ఇవ్వలేదని, ఈ విషయాన్ని ప్రజలు, రైతులు గుర్తించాలని కోరారు. రైతు భరోసాకు ఇప్పుడు ఎకరానికి రూ. 6వేలు ఇస్తానని కొత్తపాట మొదలుపెట్టిండని విమర్శించారు. కేసీఆర్ రెండు పంటలకు రైతుబంధు ఇస్తే, తాను మూడు పంటలకు ఇస్తానని చెప్పి ఇప్పటివరకు ఒక్క పంటకు ఇచ్చిందిలేదన్నారు. ఇవన్నీ ప్రజలను మోసం చేయడానికి ఝూటారెడ్డి అబద్ధపు హామీలేనన్నారు. క్వింటాలుకు ఇస్తానన్న రూ. 500 బోనస్, మహిళలకు రూ.2,500 ఏమయ్యాయని ప్రశ్నించారు. బస్సుల సంఖ్యను తగ్గించి ఉచిత బస్సు పథకాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు. ఏ సొసైటీ, ఏ బ్యాంకులో చూసినా ఇప్పటివరకు రైతురుణమాఫీ 50శాతం కూడా పూర్తికాలేదన్నారు. రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ జరిగి తీరాల్సిందేనని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తానని అబద్ధపు మాటలు చెప్పి 15నెలలు అవుతున్నా, ఏ ఒక్కరికీ ఇచ్చింది లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదని కాంగ్రెస్ నాయకులు తప్పు ఒప్పుకొని ముక్కును నేలకు రాసి గ్రామాల్లోకి అడుగుపెట్టాలన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు జలంధర్ రెడ్డి, ఆదిమూలం సతీశ్‌కుమార్, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు, నాగిరెడ్డిపేట్ మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, నాయకులు కపిల్‌రెడ్డి, కిష్టారెడ్డి, నాగం రాజయ్య, నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్లపైనే 'సినిమా' చూపెట్టారు!

- కోర్టు చౌరస్తా వద్ద రోడ్డు మూసివేత
- సినిమా ట్రైలర్ లాంచింగ్ పేరిట ట్రాఫిక్ మళ్లింపు
- ఇబ్బందులు పడిన వాహనదారులు, పాదచారులు


పాత కలెక్టరేట్ మైదానం వెలుపల రోడ్డుపై జనం

వినాయక్‌నగర్, జనవరి 8: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా నుంచి తిలక్‌గార్డెన్, బస్టాండ్ ప్రాంతాలకు వెళ్లే రోడ్డును సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా మూసివేశారు. అటువైపు వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాత కలెక్టరేట్ మైదానంలో ఓ సినిమా ట్రైలర్ లాంచింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చూడడానికి వేల సంఖ్యలో జనం రావడంతో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. కలెక్టర్ మైదానం వెలుపలతోపాటు రోడ్డుపై జనం గుంపులు గుంపులుగా నిలబడ్డారు. వారిని అదుపుచేయలేక పోలీసులు నానా పాట్లు పడాల్సి వచ్చింది. ముందస్తు ఏర్పాట్లు, సమాచారం ఇవ్వకపోవడంతో పాదచారులు వెళ్లడానికి కూడా కష్టతరంగా మారింది. ఈ క్రమంలో ఎవరికైనా ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆకస్మాత్తుగా రోడ్డును మూసివేయడంపై వాహనదారులు మండిపడ్డారు. ఇటీవల సంధ్య థియేటర్ ఘటన జరిగిన నేపథ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే అవకాశాలు ఉన్నాయని, పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడ్డారు.

## సంక్రాంతికి 444 ప్రత్యేక బస్సులు

### ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న



ఖలీల్‌వాడి, జనవరి 6: సంక్రాంతి పండుగకు ప్రభుత్వం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపనున్నది. దూర ప్రాంతాలకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లే ప్రయాణికుల కోసం 444 ప్రత్యేక బస్సులను నడిపించనున్నట్లు రీజినల్ మేనేజర్ జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు, 16 నుంచి 20వ తేదీన వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

**వివరాల కోసం.. సంప్రదించాల్సిన నంబర్లు**

| | |
|---|---|
| ఆర్మూర్ | 7382843133 |
| బోధన్ | 9849500725 |
| నిజామాబాద్ | 9959226022 |
| బాన్సువాడ | 9491105706 |
| కామారెడ్డి | 08468220281 |

## మహిళా ఓటర్లే ఎక్కువ

- పురుషుల కన్నా లక్షకు పైగా ఎక్కువగా ఉన్న అతివలు
- ఓటర్ల జాబితా విడుదల చేసిన ఈసీ
- నిజామాబాద్‌లో మొత్తం ఓటర్లు 14.35 లక్షలు
- కామారెడ్డిలో 6.90 లక్షల ఓటర్లు

### ఉమ్మడి జిల్లాలో అతివలదే ఆధిపత్యం



ఖలీల్‌వాడి/కామారెడ్డి రూరల్, జనవరి 6: ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు చేస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేసింది. తుది జాబితా ప్రకారం అన్ని నియోజకవర్గాల్లోనూ అతివలదే స్పష్టమైన ఆధిపత్యం కొనసాగుతున్నది. నిజామాబాద్ జిల్లాలో మొత్తం ఓటర్లు 14,35,214 మంది ఉండగా, వారిలో 7,58,005 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అటు కామారెడ్డి జిల్లాలోనూ ఆడవారి సంఖ్యే ఎక్కువగా ఉంది. మొత్తం 6,90,317 మంది ఓటర్లకు గాను 3,57,215 మంది మహిళలు ఉండడం గమనార్హం. మొత్తానికి ఉమ్మడి జిల్లాలో నిర్ణయాధికారం అతివల చేతుల్లోనే ఉండడం విశేషం.

**అర్బన్‌లో అత్యధికం.. బాన్సువాడలో అత్యల్పం..**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో మొత్తం 21.25 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 11,15,220 మహిళా ఓటర్లు, 10,10,200 పురుషులు, 111 మంది ఇతరులు ఉన్నారు. నిజామాబాద్ జిల్లాలో 1,565 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 14,35,214 మంది, కామారెడ్డి జిల్లాలోని 796 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 6,90,317 ఓటర్లు ఉన్నట్లు ఈసీ తెలిపింది. వీరే కాకుండా 1,428 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. ఇక, అత్యధికంగా నిజామాబాద్ అర్బన్‌లో 3,07,459 మంది ఓటర్లు ఉం డగా, అత్యల్పంగా బాన్సువాడ సెగ్మెంట్‌లో 1,98,738 మంది ఉండడం గమనార్హం.

**నిజామాబాద్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్లు..**

| నియోజకవర్గం | మహిళలు | పురుషులు | ఇతరులు |
|---|---|---|---|
| ఆర్మూర్ | 1,14,473 | 99,657 | 6 |
| బోధన్ | 1,17,768 | 1,06,999 | 5 |
| బాన్సువాడ | 1,04,145 | 94,577 | 16 |
| నిజామాబాద్ అర్బన్ | 1,59,255 | 1,48,162 | 42 |
| నిజామాబాద్ రూరల్ | 1,38,852 | 1,21,627 | 6 |
| బాల్కొండ | 1,23,512 | 1,06,108 | 4 |
| మొత్తం | 7,58,005 | 6,77,130 | 79 |

**కామారెడ్డి జిల్లాలో..**

| నియోజకవర్గం | మహిళలు | పురుషులు | ఇతరులు |
|---|---|---|---|
| జుక్కల్ | 1,05,316 | 1,01,076 | 10 |
| కామారెడ్డి | 1,34,118 | 1,23,919 | 2 |
| ఎల్లారెడ్డి | 1,17,781 | 1,08,075 | 20 |
| మొత్తం | 3,57,215 | 3,33,070 | 32 |

## హమాలీల కలెక్టరేట్ ముట్టడి

### డిమాండ్లు నెరవేర్చాలని ప్రధాన ద్వారం వద్ద నిరసన

కంఠేశ్వర్, జనవరి 6 : తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. సమ్మెలో భాగంగా సోమవారం జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ కళాశాల నుంచి ర్యాలీ చేపట్టి, కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా హమాలీలు ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభు త్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద పోలీసులను నియమించి బియ్యం సరఫరా చేసే ప్రయత్నం చేస్తున్నదని, ఆ ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలకు ప్రభుత్వ బడ్జెట్‌కు సంబంధం లేదన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం సంక్రాంతికి కార్మికులను పస్తులుంచే ప్రయ త్నం చేస్తున్నట్లు భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఓమయ్య, హన్మాండ్లు, దేవేందర్, భాజన్న, బాబార్ మౌలానా, అహ్మద్ రాజశేఖర్, వెంకటేశ్, షారూఖ్, హమాలీలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న హమాలీలు, ఏఐటీయూసీ నాయకులు





## ప్రజావాణి.. 'పత్రం' ఉంటేనే లోపలికి..

**ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి** ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు తరలివస్తుంటారు. కొన్ని రోజులుగా ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులను కలెక్టరేట్‌లోకి అనుమతించడంలేదు. ప్రధాన ద్వారం వద్దే పోలీసులు అడ్డుకుంటున్నారు. ఫిర్యాదుపత్రం ఉంటేనే లోపలికి అనుమతిస్తున్నారు. దీంతో చేసేదిలేక అక్కడికి వచ్చిన వారిని బతిమిలాడి రోడ్డు పక్కన కూర్చొని వారి సమస్యలను రాయించుకుంటున్నారు. కలెక్టరేట్‌లోకి అనుమతించకపోవడంపై కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌ను 'నమస్తే తెలంగాణ'సంప్రదించగా.. ఎలాంటి నిబంధనలు లేవని, గతంలో ప్రజావాణి కార్యక్రమంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకున్నారేమోనని తెలిపారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్